ప్రకృతి సాగువైపు.. రైతుల చూపు

- రసాయనాలు లేని వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం
- వరితోపాటు ఆకుకూరలు, కాయగూరల సాగు
- కషాయాల వినియోగంతో సాగుకు పెట్టుబడి ఖర్చు తగ్గుదల
- ఆదాయం బాగుండటంతో పెరుగుతున్న సాగు విస్తీర్ణం

తాళ్లరేవు: మార్కెట్‌లో ఏది కొనాలన్నా కల్తీ భయం, ఏది తినాలన్నా హానికర రసాయనాలు వినియోగిస్తున్నారనే ఆందోళన కొనుగోలుదారులను వెంటాడుతోంది. పంటల సాగు, ఆహార పదార్థాలను నిల్వ చేసేందుకు రసాయనాల వినియోగం అధికమవడంతో ఏ పదార్థం తింటే ఏమవుతుందోనని ప్రజలు నిత్యం భయం, భయంగా తినాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా మనం ప్రతిరోజూ తినే అన్నం దగ్గర నుంచి పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పాలు ఇలా ప్రతీ ఆహార పదార్థం రసాయనాల మయమయ్యాయి.

గోఆధారిత సహజ ఎరువులు, కషాయాలు

రసాయనాలతో కూడిన ఆహార పదార్థాలను తినడం వల్ల అనేక మంది అనారోగ్యం బారిన పడుతూ ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో రసాయనాలు వినియోగించని ఆహార పదార్థాలకు ప్రకృతి వ్యవసాయం ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. కషాయాలు, జీవామృతం, మీనామృతం వంటి గోఆధారిత సహజ ఎరువులు, కషాయాలు రసాయనాలకు బదులుగా వాడి ప్రకృతి వ్యవసాయం ద్వారా కొందరు రైతులు పంటలు పండిస్తున్నారు. ఆహార ధాన్యాల నుంచి కాయగూరల వరకు, అపరాలతోపాటు పండ్లు కృత్రిమ ఎరువులు, రసాయన క్రిమిసంహారకాలు వాడకుండా కేవలం వివిధ రకాల ఆకులు, మత్స్య ఉత్పత్తులతో కషాయాలు తయారు చేస్తూ వినియోగిస్తున్నారు. గోమయం, గోమూత్రంతో తయారు చేసిన జీవామృతంతో పండించిన పంటలు అధిక దిగుబడిని ఇస్తూ సాగుదారులకు ఆదాయాన్ని అందిస్తున్నాయి. సేంద్రియ ఉత్పత్తులు ఆహారంగా వినియోగించిన వారికి సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తున్నాయి.



పి.మల్లవరం ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో దశపర్ణి కషాయం తయారీకి సిద్ధం చేస్తున్న రైతులు



పంటలకు వినియోగించే కషాయాన్ని రైతుల సమక్షంలో తయారు చేస్తున్న కృషి అమృత్ ప్రకృతి వ్యవసాయ క్షేత్రం నిర్వాహకులు



పి. మల్లవరంలో కృషి అమృత్ ప్రకృతి వ్యవసాయ క్షేత్రం

నాణ్యత, స్వచ్ఛతతో ఉత్పత్తులు

ఎంతోకాలంగా సాగుతున్న సంప్రదాయ పంటలకు దీటుగా కొంతమంది పర్యావరణ ప్రేమికులు, ప్రజా సంక్షేమాన్ని కాంక్షించేవారు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఏర్పాటు చేసి సేంద్రియ, ప్రకృతి ఆధారిత పంటలను పండిస్తున్నారు. రసాయనాలు వినియోగించే పంటల కంటే ఎంతో నాణ్యత, స్వచ్ఛతతో ఉత్పత్తులు సాధిస్తున్నారు. దేశవాళీతోపాటు హైబ్రిడ్ రకాలను కూడా సాగుచేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. సంప్రదాయ పంటలకన్నా ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆదాయం తక్కువ వస్తున్నప్పటికీ ప్రజారోగ్యమే లక్ష్యంగా వ్యవసాయం చేస్తున్నామని, ప్రభుత్వం సహకారమందిస్తే మరింత ఉత్సాహంగా పంటలు పండిస్తామని రైతులు తెలిపారు. దీంతో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ఏపీసీఎన్ఎఫ్ (ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ బేస్డ్ నాచురల్ ఫార్మింగ్) ద్వారా ప్రత్యేక అవగాహన, కషాయాల తయారీపై శిక్షణ ఇస్తున్నారు.

ప్రకృతి సాగుకు అధిక శ్రమ



రసాయనాలు వాడిన ఆహార పదార్థాలను తినడం ద్వారా ప్రజలు దీర్ఘకాల వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రకృతి వ్యవసాయం, గోఆధారిత పంటలు పండించడాన్ని ప్రారంభించాము. తొలుత ఐదు కుంచాల్లో ప్రారంభించి, ప్రస్తుతం ఐదు ఎకరాలకు సాగును విస్తరించాం. రైతులను ప్రకృతి వ్యవసాయంవైపు ప్రోత్సహిస్తున్నాం. ప్రకృతి వ్యవసాయానికి శ్రమ ఎక్కువ, ఆదాయం తక్కువ. ప్రజల నుంచి వస్తున్న స్పందనతో సాగు కొనసాగిస్తున్నాం.

– ధూళిపూడి వెంకటరమణ, ప్రకృతి వ్యవసాయ క్షేత్రం రైతు, పి.మల్లవరం

నీరు, జీవామృతాలతోనే పంటల సాగు



నీటితోపాటు, గోమయం, గోమూత్రంతో తయారు చేసిన జీవామృతంతోనే పంటల సాగు చేస్తున్నాం. విత్తనాల ఎంపిక దగ్గర నుంచి వాటి పెంపకం వరకు స్వయంగా పరిశీలిస్తూ ఎటువంటి రసాయనాలు వాడకుండా పంటలు సాగు చేస్తాం. చీడపీడల నివారణకు మట్టి, ఆముదంతోపాటు వేపాకులతో తయారు చేసే నీమాస్త్రం, పొగాకు కాడలు, వెల్లుల్లి, మిర్చి వంటి పదార్థాలతో తయారు చేసే బ్రహ్మాస్త్రం వంటి కషాయాలను వినియోగిస్తున్నాం.

– పులి రాంబాబు, వ్యాస ఫామ్స్ నిర్వాహకుడు, పోలేకుర్రు

రసాయనాలు వద్దు.. కషాయాలు ముద్దు



వ్యవసాయంలో రసాయనాలు వద్దు, కషాయాలు ముద్దు అనే నినాదంతో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రసాయనాలతో సాగు ద్వారా పెట్టుబడి ఎక్కువ కావడంతో పాటు భూసారం తగ్గడం, కొన్నిసార్లు నష్టాలు వచ్చి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో సుభాష్ పాలేకర్ విధానాల్లో భాగంగా దశపర్ణి కషాయం, మీనామృతం, కోడిగుడ్లు నిమ్మ ద్రావణం, బయో ఎంజైమ్స్ తయారు చేయడంపై రైతులకు శిక్షణ ఇస్తున్నాం.

– గుండ్ర శివచక్రం, కాకినాడ, కోనసీమ జిల్లాల మాస్టర్ ట్రైనర్, ఏపీసీఎన్ఎఫ్

క్లుప్తంగా

దళితులపై దాడులు చేస్తే సహించేది లేదు

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో దళితులపై దాడులు అధికమయ్యాయని, నిందితులకు మంత్రి వాసంశెట్టి సుభాష్ కొమ్ముకాయడం సరికాదని దళిత నాయకులు సమావేశంలో అన్నారు. అమలాపురం రూరల్ నడిపూడి దాబా గార్డెన్‌లో దళిత నాయకులు బొంతు రమణ ఆధ్వర్యంలో సమావేశమైన సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా బొంతు రమణ మాట్లాడుతూ దోనిపాటి మహేష్‌పై జరిగిన దాడిపై వారు చర్చించారు. అసలు కారకుడైన రాయల్ కాలేజీ ప్రిన్సిపాల్ గుత్తుల విజయ్‌కుమార్‌ను కేసు నుంచి పోలీసులు రాజకీయ ఒత్తిడితో తప్పించారని విమర్శించారు. విజయ్‌కుమార్‌ను అరెస్ట్ చేయకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ దళితులపై దాడులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత నాయకులు మాకే భీమారావు, జక్కల అరుణ్ కుమార్, గిడ్ల వెంకటేశ్వర రావు, జల్లి శ్రీనివాస రావు, జిత్తుక సత్యనారాయణ, కొండా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నాగాదిత్యకు 'పంచాంగ వైభవ రత్న' బిరుదు



నాగాదిత్యను సత్కరిస్తున్న రుద్రరాజు పద్మరాజు తదితరులు

అమలాపురం టౌన్: పంచాంగ కర్త, పురోహిత బ్రహ్మ ఉపద్రష్ట నాగాదిత్యకు పంచాంగ వైభవ రత్న బిరుదు లభించింది. హైదరాబాద్ శ్రీ లలిత కళా సమాఖ్య సాంస్కృతిక సామాజిక సంస్థ నాగాదిత్యకు ఈ బిరుదును ప్రదానం చేసి సువర్ణ గంటా కంకణంతో ఘనంగా సత్కరించింది. హైదరాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాయ గాన సభ నిలయంలో ఆ సంస్థ ప్రతినిధులు రుద్రరాజు పద్మరాజు, సినీ నటులు జెన్నీ, శివాజీ రాజా చేతుల మీదుగా నాగిదిత్యను ఆదివారం ఉదయం ఘనంగా సత్కరించి బిరుదును ప్రదానం చేశారు. సంస్థ కార్యదర్శి మహేంద్రవాడ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో నిష్ణాతులైన 78 మంది పండితులను ఈ సందర్భంగా సత్కరించారు.

పేకాట స్థావరాలపై ఆకస్మిక దాడి

అమలాపురం టౌన్: పట్టణంలో రెండు చోట్ల పేకాట స్థావరాలపై పోలీసులు ఆదివారం సాయంత్రం ఆకస్మిక దాడులు చేసి 10 మంది జూదరులను అరెస్ట్ చేశారు. స్థానిక ఎర్ర వంతెన వద్ద గల ఒక లాడ్జిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.3,800 నగదు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక శ్రీరామనగర్ వద్ద పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.12 వేల నగదు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై ఎస్ఆర్ కిషోర్‌బాబు తెలిపారు. ఈ దాడుల్లో పట్టణ సీఐ పి.వీరబాబు, పట్టణ ఎస్సైలు కిషోర్‌బాబు, టి.శ్రీనివాస్, జోషితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి ఘన సత్కారం

అల్లవరం: కోడూరుపాడు ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించి జూలై 31న ఉద్యోగ విరమణ పొందిన పీవీఎల్ నరసింహారావును అల్లవరం మండల విద్యాశాఖాధికారి సానబోయిన ఏడుకొండలు ఆదివారం అమలాపురంలో ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నరసింహారావు సేవలను కొనియాడారు. అనంతరం శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉండ్రు ముసలయ్య, పెదమల్లు సతీష్ పాల్గొన్నారు.

అగ్నిబాధితులకు సహాయం

అమలాపురం రూరల్: ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో ఇల్లు కోల్పోయి నిలువ నీడ లేక ఇబ్బంది పడుతున్న రెండు కుటుంబాలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సాయం అందించారు. అమలాపురం కామనగరువు 1వార్డులో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో రెండు కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. అమలాపురంలో ఆదివారం పర్యటించిన మంత్రి సుభాష్‌కు స్థానిక నాయకులు ఇరు కుటుంబాలు ఎదుర్కొంటున్న దయనీయ స్థితిని వివరించారు. వెంటనే స్పందించిన మంత్రి సుభాష్ బాధితులు కుంచే శాంతమ్మ, వాసంశెట్టి పెద్దిరాజుకు రూ.15 వేలు చొప్పున మొత్తం రూ.30 వేలు చెక్కు రూపంలో ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ జేఈల అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు

యానాం: పుదుచ్చేరి విద్యుత్ శాఖ జూనియర్ ఇంజనీర్ పోస్టులకు నిర్వహించిన రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు అనంతరం ఆదివారం వారికి ఆ శాఖ సూపరిండెంట్ ఇంజనీర్ రాజేష్ సన్యాల్ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా యానాం రీజియన్ నుంచి ఎంపికైన మెల్లం శరత్‌రాజ్, పంపన జ్యోతినారాయణ, కొల్లు శ్రీనివాస్‌ను యానాం సబ్‌స్టేషన్‌లో నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. పుదుచ్చేరి, కారైకల్, మాహే రీజియన్ల నుంచి ఎంపికైనవారికి మొత్తం 40 మందికి ఆయా రీజియన్లలో నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

కోనసీమను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దాలి

అమలాపురం టౌన్: కోనసీమ ప్రాంతాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దాలని ఎస్పీ మోకా సత్తిబాబు ఆకాంక్షించారు. శ్రీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ద్వారా పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన ఉద్యోగార్థులకు స్థానిక కొంకాపల్లిలో ఆదివారం నిర్వహించిన సత్కార సభకు ఎస్పీ సత్తిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కోనసీమ ప్రాంతం ప్రకృతి సహజ వనరులు, పర్యాటక సొబగులు ఉన్న ప్రాంతమే కాకుండా విద్యా ప్రతిభకు ఏ మాత్రం కొదవలేదని ఎస్పీ సత్తిబాబు స్పష్టం చేశారు. సభలో అమలాపురం డీఎస్పీ టీఎస్ ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ ఎస్పీ సత్తిబాబు శ్రీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేద కుటుంబాల్లోని యువత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు వారికి ఉచిత కోచింగ్, స్టడీ మెటీరియల్ అందజేయడం అభినందనీయమన్నారు. పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన తీగా మల్లిక, అంబటి భాగ్యలక్ష్మి, పోలవరపు సత్య, జనుపల్లి శాంతిశ్రీ, పులిదండి ప్రశాంత్, పెట్టా మురళీ, పాము గౌతమ్ కృష్ణ, ఓలేటి శివకుమార్, కొల్లు జనార్ధనరావు, అడపా చంద్రశేఖర్, జల్లి నాగమణి, పెయ్యల వెంకట కృష్ణారెడ్డి, జొన్నాడ ప్రశాంత్‌కుమార్, సబ్బతి ప్రతాప్‌ను ఎస్పీ సత్తిబాబు సత్కరించి అభినందించారు. కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు ఎస్పీ సత్తిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. సభలో శ్రీ చారిటబుల్ ప్రతినిధులు గోసంగి బంగరాజు, సందిక సిద్ధార్థ కుమార్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, చొల్లంగి అప్పాజీ, వాకపల్లి భీమారావు, పెట్టా వెంకటరావు, నేరుడుమిల్లి సత్యనారాయణ, దాసరి అప్పలస్వామి, సాధనాల నాగబాబు పాల్గొన్నారు.



పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను అభినందిస్తున్న ఎస్పీ సత్తిబాబు

'ఉచిత బస్సు'తో ఆటో వాలాల ఉపాధికి గండి

అమలాపురం రూరల్: ఆగస్టు 15 నుంచి ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం కల్పించనున్న నేపథ్యంలో తమ ఉపాధికి గండి పడుతుందని, తమకు వృత్తి ఉపాధి రక్షణ కల్పించాలని ఆటో కార్మికులు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కోరారు. ఆటో రంగంపై ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు 20 లక్షల మంది జీవనోపాధి పొందుతున్నారని, ఆ కుటుంబాలకు భరోసా కల్పించాలని వారు కోరారు. అమలాపురంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఆంధ్ర ఆటోవాలా సదస్సులో మంత్రి సుభాష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆర్టీసీ బస్సు సర్వీసులకు ఆటోలను అనుసంధానం చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలని, ప్రస్తుతం ఉన్న డీజిల్ ఆటోలను ఎలక్ట్రికల్ ఆటోలుగా భర్తీ చేసేందుకు సహకారం అందించాలని ఆంధ్రా అటో యూనియాన్ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు కోరారు. పేద కుటుంబాలను పీ4 ద్వారా దత్తత తీసుకొని ఆర్థికంగా భరోసా ఇవ్వాలని కోరారు. సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ఆటో కార్మికులకు న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు . అనంతరం ఆటో యూనియన్ నాయకులు వాసంశెట్టి సత్తిరాజు, బొంతు బాలరాజు, ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొప్పుల సత్తిబాబు తదితరులు మంత్రి సుభాష్‌ను ఘనంగా సత్కరించారు.



మంత్రి సుభాష్‌ను కలిసిన ఆటో యూనియన్ నాయకులు

తపాలా శాఖలో బాజ్జీ సేవలు ఆదర్శనీయం

అమలాపురం టౌన్: తపాలా శాఖలో 36 ఏళ్ల పాటు సుదీర్ఘ సేవలు అందించిన అమలాపురం పోస్టల్ సబ్ డివిజన్ ఓవర్సీర్ ఎంవీవీఎస్ఎస్ నరసింహం (బాజ్జీ) సేవలు ఆదర్శనీయమని విశాఖపట్నం రీజియన్ విశ్రాంత పోస్ట్ మాస్టర్ జనరల్ ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. బాజ్జీ ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక కొంకాపల్లి రామకృష్ణ సమితి వద్ద ఆదివారం నిర్వహించిన వీడ్కోలు సభకు వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎఫ్ఎన్ పీవో ఆల్ ఇండియా సెక్రటరీ జనరల్ వాసిరెడ్డి శివాజీ మరో అతిథిగా పాల్గొని బాజ్జీ సేవలను కొనియాడారు. అమలాపురం పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ ఆర్.నవీన్‌కుమార్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీధరం తదితరులు బాజ్జీ సేవలను వివరించారు. తొలుత ఎఫ్ఎన్ పీవో యూనియన్ ద్వైవార్షిక సమావేశం నిర్వహించి అమలాపురం పోస్టల్ డివిజన్‌కు నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. చివరిగా ఉద్యోగ విరమణ చేసిన బాజ్జీ దంపతులను పోస్టల్ శాఖ అధికారులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పోస్టల్ ఇన్‌స్పెక్టర్లు కోటేశ్వరరావు, వంశీ, అమరనాథ్, శ్రీనివాస్, పోస్టల్ యూనియన్ నాయకుడు ఏకాంబరంతోపాటు విశాఖపట్నం, ఢిల్లీ నుచి పోస్టల్ యూనియన్ ఉద్యోగులు బాజ్జీ వీడ్కోలు సభకు హాజరయ్యారు.



బాజ్జీ దంపతులను సత్కరిస్తున్న పోస్టల్ శాఖ అధికారులు, యూనియన్ నాయకులు

రైతుల సమస్యలను పరిష్కరించాలి

యానాం: రైతుల సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించి వారికి రావాల్సిన రాయితీలు సక్రమంగా అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదివారం ఫార్మర్స్, ప్రొడ్యూసర్స్ కో ఆపరేటివ్ సొసైటీ సమావేశం ఆర్ఏఓ మునిస్వామికి విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ వ్యవసాయశాఖ ద్వారా రైతులకు రాయితీపై ట్రాక్టర్ల మంజూరు చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించిందన్నారు. రైతుల వాటా సొమ్మును ప్రభుత్వానికి చెల్లించినప్పటికీ సంబంధిత సొమ్మును అధికారులు ఆ కంపెనీకి చెల్లించకపోవడంతో ట్రాక్టర్ల డెలివరీ నిలిచిపోయిందన్నారు. పుదుచ్చేరిలో అధికారులతో మాట్లాడి ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం ద్వారా సోలార్ పంపులు, వ్యవసాయ పనిముట్లు ఇప్పించాలని కోరారు. ఈ సమావేశంలో ఫార్మర్స్ ప్రొడ్యూసర్ల చీఫ్ ప్రమోటర్, అధ్యక్షుడు మాజేటి సత్యభాస్కర్, వ్యవసాయ అధికారి జోగిరాజు, రైతు నాయకులు ఈలప్రోలు విష్ణువర్ధన రావు, మల్లాడి శామ్యూల్, కోన వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



కోఆపరేటివ్ సొసైటీ రైతుల సమావేశంలో ఆర్ఏఓ మునిస్వామి

చంద్రబాబు మోసాలపై ఇంటింటా ప్రచారం

- ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్
- అమలాపురం పట్టణంలో పలు వార్డుల్లో సమావేశాలు

అమలాపురం టౌన్: చంద్రబాబు నయవంచక పాలన తీరును, సాధ్యం కాని హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం నేడు ప్రజలను ఎలా వంచిస్తుందో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ ప్రజలకు వివరించారు. అమలాపురం పట్టణంలో 5,6,7,8,10 వార్డుల్లో ఆదివారం నిర్వహించిన 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ' కార్యక్రమాల్లో ఇజ్రాయిల్, డాక్టర్ శ్రీకాంత్ ముఖ్య అతిథులుగా పాల్గొని ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఆయా వార్డుల్లో ఇంటింటా ప్రచారంతో పాటు ఆ వార్డుల్లో పలు ఇళ్ల వద్ద సమావేశాలు ఏర్పాటు చేసి మరీ బాబు మోసాలను వివరించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వైఎస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, పార్టీ బీసీ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని రోడ్ల పక్కన చిరు వ్యాపారుల వద్దకు వెళ్లి చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. పార్టీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్, మున్సిపల్ కౌన్సిలర్లు చిట్టూరి పెదబాబు, గొవ్వాల రాజేష్, కొల్లాటి దుర్గాబాయి, చిత్రపు రామకృష్ణ, కట్టోజు సన్యాదాసు, పార్టీ నాయకులు ఉండ్రు బాబ్జి, కముజు రమణ, దంతులూరి రోహిత్ వర్మ, కల్వకొలను ఉమ, విత్తనాల మూర్తి, కుడుపూడి భరత్ భూషణ్, మద్దింశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

కూటమి మోసాలను ప్రజలకు వివరించాలి

తాళ్లరేవు: ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని చంద్రబాబు పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసగించారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సీనియర్ నాయకులు, ఐదు జిల్లాల ప్రచార విభాగ అధ్యక్షుడు చింతలపాటి శ్రీనివాసరాజు అన్నారు. ఆదివారం పిల్లంక, గోవలంక గ్రామ పంచాయతీల్లో పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ అధ్యక్షతన, నియోజకవర్గ పరిశీలికుడు మాతా మురళి నేతృత్వంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంజరం, ఉప్పంగల, లచ్చిపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి వుంగరాల సంతోష్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లీగల్ సెల్ కోఆర్డినేటర్ మోర్త శ్రీనివాసరావు, నాయకులు ముద్దన వెంకటశివరామ ప్రసాద్, కోరుకొండ కిరణ్‌కుమారి, అనిశెట్టి శ్రీనివాసరెడ్డి, దవులూరి శ్రీరామ్మూర్తి, శాఖ శంకరుడు, మోర్త భీమాబాయి, కూరాటి శ్రీకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాకర్లపూడి కృష్ణంరాజు, కొపనాతి నాగరాజు, బొంతు మోహన్, పోతుల రత్నకుమారి, వెంటపల్లి నూకరాజు, పంపన రామకృష్ణ, రిటైర్డ్ జెడి పెట్ల సూర్యనారాయణ రాజు, పేర్ని ఆదినారాయణ మూర్తి, పెయ్యల కొండబాబు, రేవు నాగేశ్వరరావు, గుత్తుల శ్రీను, రెడ్డి నాగేశ్వరరావు, కోరుకొండ చంటి, వీరవిష్ణ్వేశ్వరరెడ్డి, ముడికి సుజాత, నూకరాజు, కాదా సూర్యనారాయణ, చెల్లుబోయిన శ్రీను, ముడికి నాగరాజు, విత్తనాల వెంకన్నబాబు, కె. భైరవ మూర్తి, కేబుల్ శ్రీను, సంగాని దాసు, శ్రీరామ్, ఏడుకొండలు, చిన్నరాజా, అప్పారావు పాల్గొన్నారు.



అమలాపురం 10వ వార్డులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, పార్టీ కో ఆర్డినేటర్ శ్రీకాంత్



పిల్లంక పంచాయతీలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న చింతలపాటి శ్రీనివాసరాజు

రహదారి అభివృద్ధి చేయాలని రైతుల వినతి

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ పరిధిలోని ప్రధాన మురుగు కాలువ (మందార కాలువ) గట్టు రహదారిని అభివృద్ధి చేయాలని, కాలువపై వంతెన నిర్మించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజును ఆ ప్రాంత రైతులు కోరారు. ఆదివారం నీలపల్లి నీటి సంఘం అధ్యక్షుడు ధూళిపూడి గోవిందరావు ఆధ్వర్యంలో రైతులు కనుమూరి సత్యనారాయణరాజు, ఏడిద సూరిబాబు, ధూళిపూడి ఈశ్వరరావు, అనుకొండ శివన్నారాయణ చౌదరి తదితరులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మందార కాలువ రహదారి అధ్వానంగా మారడంతో వర్షాకాలంలో రైతులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రహదారి అభివృద్ధిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

స్నేహితుడి జ్ఞాపకార్థం రక్తదాన శిబిరం

అమలాపురం రూరల్: సమనసకు చెందిన పేరాబత్తుల కృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం సమనసలో రక్తదాన శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. తొలుత రూరల్ సీఐ డి.ప్రశాంత్ కుమార్, పేరాబత్తుల కృష్ణ కుమార్తె, కుమారుడితో కలసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సీఐ ప్రశాంత్‌కుమార్ స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అపోహలు విడనాడి రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని సీఐ కోరారు. అనంతరం స్నేహితులు, గ్రామస్తుల ద్వారా సేకరించి పోస్టాఫీసులో జమ చేసిన రూ.1.30 లక్షల డిపాజిట్ పుస్తకాలను కృష్ణ పిల్లలకు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పరమట శ్యామ్ కుమార్, ఉప సర్పంచి మామిళ్లపల్లి దొరబాబు, సొసైటీ చైర్మన్ సత్తి రామచంద్రరావు, మాజీ ఎంపీపీ యెరుబండి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచి నడింపల్లి ఉదయబాబు, మాజీ సొసైటీ అధ్యక్షుడు మామిళ్లపల్లి రాజారావు, గ్రామస్తులు పాల్గొన్నారు



సమనసలో రక్తదానం చేస్తున్న యువకులు

స్నేహితుల దినోత్సవ వేళ అ'పూర్వ' సమ్మేళనం



గురువులతో 1975 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు



చిన్ననాటి స్నేహితులతో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అమలాపురం టౌన్: ఉద్యోగాలు, వ్యాపారాలు చేసి విశ్రాంతి తీసుకుంటున్న వారంతా స్నేహితుల దినోత్సవం వేళ బాల్యంలో విద్యనభ్యసించిన అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం కలసి వేడుక చేసుకున్నారు. చిన్ననాటి స్నేహితులను కలసి తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆ పాఠశాలలో 1975లో పదో తరగతి చదవిన బ్యాచ్‌కు చెందిన 74 మంది పూర్వ విద్యార్థులు 50 ఏళ్ల తరువాత ఆత్మీయ సమ్మేళనంలో కలసి రోజంతా సరదాగా గడిపారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు పటానేని మణి, నూలు అన్నపూర్ణ, నిమ్మకాయల లక్ష్మీకాంతం, మునగాల మన్యంను ఘనంగా సత్కరించి పాద పూజ చేశారు. పూర్వం విద్యార్థుల్లో చాలామంది 65 ఏళ్లు దాటిన వారున్నారు. మలి సంధ్యలో ఉన్న వారంతా తమ బాల్య స్నేహాన్ని అపూర్వ కలయిక ద్వారా వికసింపజేసుకున్నారు. స్నేహితులను నాటి నిక్ నేమ్‌లతో పిలుచుకుని సందడి చేశారు. పాఠశాల ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు భమిడిపాటి రామకృష్ణను వారు సత్కరించారు. పాఠశాలకు కంప్యూటర్‌ను సమకూర్చేందుకు వారు ముందుకు వచ్చారు. పూర్వ విద్యార్థి బీవీసీ ఇంజినీరింగ్ సంస్థల చైర్మన్ బోనం కనకయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, విశ్రాంత బ్యాంక్ అధికారి యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, అప్పారి సత్యప్రసాద్, కోట రవికుమార్, సరిపెల్ల గోపాల కృష్ణ, సలాది గోవిందు తదితరులు ఈ ఆత్మీయ కలయికకు ఏర్పాట్లు చేశారు. చివరిగా అందరూ సహపంక్తి భోజనాలు చేసి ఆత్మీయతను పంచుకున్నారు. తమ జ్ఞాపకాలను పదిలం చేసుకుంటూ గ్రూప్ ఫొటోకు దిగారు. పూర్వం విద్యార్థులంతా యూనిఫాం వస్త్రధారణతో వేడుకకు హాజరై మరింత ప్రత్యేకతను చాటుకున్నారు.

మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ..

అల్లవరం: బాల్యంలోని మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ అల్లవరం గణపతి పబ్లిక్ స్కూల్లో ఆదివారం పూర్వ విద్యార్థులు స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ తన చిన్ననాటి స్నేహితులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసి ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ చిన్ననాటి మిత్రులను ఎప్పుడూ మరచిపోనని, నా హృదయంలో వారికి ప్రత్యేక స్థానం ఉంటుందన్నారు. స్నేహితుల దినోత్సవం రోజున మిత్రులను కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని ఎమ్మెల్సీ అన్నారు. ఈ కార్యక్రమంలో కంకిపాటి గణపతి, మంగళంపల్లి సుబ్రహ్మణ్యం, అడపా శ్రీనివాసరావు, కాండ్రేగుల తిలక్, కంచర్ల శ్రీనివాసరావు, కొల్లు వెంకటరమణ, రాజాజీ, గుత్తాపు శ్రీను, జంగా నాగేశ్వరరావు, కలకత్తా రామకృష్ణ, కడలి శ్రీనివాసరావు, ఏడుకొండలు, అల్లూరి రాంబాబు పాల్గొన్నారు.